క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్మాన్‌ఘడ్ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. చంచల్‌గూడ ఫీడర్ పరిధిలో ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు, ఇస్లామియా ఫీడర్, షా కాలనీ, జమాల్ కాలనీ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

25 నుంచి డేటా సైన్స్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

యాకుత్‌పురా: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నిరుద్యోగ యువతీయువకులకు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ టెక్ జాబ్స్ ప్రోగ్రాంలో భాగంగా ఈ నెల 25న నుండి డేటా సైన్స్ కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించనున్నామని ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ రాఘవేందర్ రావు తెలిపారు. 2021 నుండి 2023 వరకు బీటెక్ (సీఎస్ఈ, ఈసీఈ, ఐటీ, మెకానికల్) పూర్తి చేసిన వారు ఈ కోర్సుకు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 9454169219, 8328203807 నెంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

చార్మినార్ మండల తహసీల్దార్‌గా జానకి

యాకుత్‌పురా: చార్మినార్ మండల తహశీల్దార్‌గా కె.జానకిని నియమిస్తూ అధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్పీఆర్ మల్లేష్ కుమార్ హిమయత్ నగర్ తహశీల్దార్‌గా బదిలీ కావడంతో ఆయన స్థానంలో హైదరాబాద్ జిల్లా యూఎస్‌సీ విభాగంలో తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న జానకిని చార్మినార్ తహశీల్దార్‌గా నియమించారు.

సన్మానం



కళార్చనను సన్మానిస్తున్న న్యాయవాది ఎజాజ్ అలీ ఖురేషి

చార్మినార్: హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి జి.కళార్చనను బుధవారం న్యాయవాది ఎజాజ్ అలీ ఖురేషి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు కె.మీనాక్షి, సత్యవాణి, డి.ఎస్.వి.మహాలక్ష్మీ, ఇంతియాజ్ అలీ ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

టోలిచౌకీ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్

గోల్కొండ: టోలిచౌకీ వద్ద ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశామని టోలిచౌకి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. బుధవారం సిబ్బందితో కలిసి టోలిచౌకి, నానల్‌నగర్ జంక్షన్ తదితర ప్రాంతాలలో ట్రాఫిక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టోలిచౌకి, హకీంపేట్ రోడ్డు, టోలిచౌకి చౌరస్తా, సెవన్ టూంబ్స్ రోడ్ల పై భారీ పైప్‌లైన్ పనులు జరుగుతున్నందున ఆ ప్రాంతాలలో ట్రాఫిక్‌ను మళ్లించినట్లు వివరించారు. ఈ కారణంగా ఆయా ప్రాంతాలలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిందన్నారు.

నేటి బీసీల సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

గౌలిపురా: భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో గురువారం నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర బీసీల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రమేశ్ గురుస్వామి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ... ఈ నెల 18వ తేదీన నాగోల్‌లోని శుభం గార్డెన్‌లో నిర్వహించనున్న బీసీల సమ్మేళన కార్యక్రమంలో తెలంగాణ జిల్లాలోని బీసీలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలి



మంత్రి సబితా ఇంద్రారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న నీల వెంకటేష్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 44 వేల టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయాలని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్ కోరారు. ఈ మేరకు బుధవారం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకపోతే విద్యార్థులకు సరైన విద్య ఎలా అందుతుందని ప్రశ్నించారు. జేఏసీ సభ్యులు ఊర్మిళ, అనురాధ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

రైతుబేజార్..!

- అధ్వానంగా మెహిదీపట్నం రైతుబజార్ నిర్వహణ
- రైతుబజార్ బోర్డు మాయం
- మెయిన్ గేటు ముందే అక్రమ స్టాళ్లు

గోల్కొండ: మెహిదీపట్నం రైతుబజార్ నిర్వహణ అధ్వానంగా మారింది. కొంత కాలంగా రైతుబజార్ అని సూచించే బోర్డు కూడా కనిపించడం లేదంటే అధికారుల తీరు ఎలా ఉందో అర్థమవుతోంది. మరోవైపు గేటు ముందే అక్రమంగా కూరగాయల దుకాణాలు వెలిశాయి. అధికారులు చూసీచూడనట్లు ఉంటున్నందు వల్లే కొందరు గేటు ముందే కూరగాయలు, పండ్ల వ్యాపారం జోరుగా కొనసాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రద్దీగా ఉండే సాయంత్రం సమయంలో గేటు ముందే కూరగాయల గంపలు పెట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ కారణంగా రైతుబజార్ లోపలికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు.



మెహిదీపట్నం రైతుబజార్ మెయిన్ గేట్

- ఇది రైతుబజార్ బయట దృశ్యం అయితే.. లోపలి పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉంది. బినామీ రైతులు, గుర్తింపు కార్డులు లేని వారు కూడా లోపల అమ్మకాలు సాగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- రైతుబజార్ కింది స్థాయి సిబ్బంది మద్దతుతోనే రైతులు కానివారు, గుర్తింపు కార్డులు లేని వారు సైతం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు రైతుబజార్ లోపల అమ్మకాలు సాగిస్తున్నారు. వీరు రైతుబజార్‌లోని షెడ్ల ముందే ఇలా కూరగాయలు అమ్ముతున్నారు. ఈ కారణంగా రైతుబజార్‌లో నడవడానికి సైతం కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు.
- ఇక రైతుబజార్‌లో పారిశుద్ధ్యం నిర్వహణ అధ్వాన్నంగా తయారైంది. రైతుబజార్‌లో పారిశుద్ధ్య పనుల కోసం వారానికి ఒక రోజున మంగళవారం సెలవు ఉంటుంది. అయినా కూడా పనుల గురించి పట్టించుకునే వారులేరు.
- రైతుబజార్ ప్రహారీ పొడవునా కుళ్లిన కూరగాయల కుప్పలు పడివుంటున్నాయి. వీటి నుంచి దుర్గంధం వ్యాపిస్తూ కొనుగోలుదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. మరోవైపు లోపల ఉన్న టాయిలెట్ల నిర్వహణ దారుణంగా తయారైంది.
- గత కొన్ని సంవత్సరాలుగా మెహిదీపట్నం రైతుబజార్ నిర్వహణపై రైతుబజార్‌కు వచ్చే వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలు, బస్తీలలో ఏర్పాటు చేసే వారపు సంతలలోనే తాము కూరగాయలు కొంటున్నామని, అధానంగా ఉన్న రైతుబజార్‌కు రావడం కంటే వారపు సంతలే బెటర్ అంటూ మరికొందరు అంటున్నారు.
- మరోవైపు కూరగాయల ధరల పట్టిక పై ఉన్న ధరలు, వ్యాపారులు అమ్మే ధరలకు వ్యత్యాసం ఉంటోందని మరికొందరు అంటున్నారు. అధికారులు ఇప్పటికైనా రైతుబజార్ సవ్యంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పేద విద్యార్థులకు అందని ద్రాక్షగా విద్య

చార్మినార్: ప్రభుత్వ నిర్లక్ష్యంతో పేద, మధ్య తరగతి విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగా మారిందని భారతీయ జనతా యువ మోర్చా భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు ఎ.శివచంద్రగిరి పేర్కొన్నారు. భారతీయ జనతా యువ మోర్చా భాగ్యనగర్ జిల్లా ఆధ్వర్యంలో బుధవారం ఆయన నాయకులతో కలిసి హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీఎం కేసీఆర్‌కు ప్రభుత్వ ఆదాయంపై ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యలు, ప్రాథమిక విద్యపై లేదన్నారు. రెవెన్యూ, మద్యంపై వచ్చే ఆదాయంపై అధ్యయనం చేస్తే ప్రభుత్వం పాఠశాలలో విద్య ఏ విధంగా ఉందో అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్ మోహన్, ఉపాధ్యక్షులు రాజేశ్, కార్యదర్శి భార్గవ్ చారి పాల్గొన్నారు.



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యువ మోర్చా భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు శివచంద్రగిరి

పనుల్లో జాప్యాన్ని సహించేది లేదు

గోల్కొండ: అభివృద్ధి పనుల్లో జాప్యాన్ని సహించేది లేదని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్‌తో కలిసి నానల్‌నగర్ డివిజన్‌లోని సాలార్జంగ్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ సమస్యలను వివరించారు. కాలనీ రోడ్లపై ప్రతినిత్యం డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులపై అధికారులు స్పందించడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. జలమండలి కార్యాలయం తమ కాలనీలోనే ఉన్నా ఫలితం లేకుండా పోయిందన్నారు. దీంతో ఎమ్మెల్యే జలమండలి అధికారులను అక్కడికి పిలిపించి మాట్లాడారు. కార్యక్రమంలో మజ్లిస్ ఏరియా కమిటీ అధ్యక్షులు ఎజాజ్ అహ్మద్ తదితరులున్నారు.



సాలార్జంగ్ కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

వైభవంగా రంగనాథుడి రథోత్సవం



జియాగూడ: జియాగూడ రంగనాథస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామివారి రథోత్సవం కనుల పండువగా కొనసాగింది. దేవాలయం నుండి ప్రారంభమైన రథం ఊరేగింపు రంగనాథనగర్, కంచరబస్తీ, భీమ్‌నగర్, లక్ష్మీ నర్సింహానగర్, వెంకటేశ్వర నగర్, ఇక్బాల్ గంజ్ మీదుగా పురానాపూల్ చేరుకుని తిరిగి ఆలయానికి చేరుకుంది. ఊరేగింపు రహదారిలో పలుచోట్ల స్వాగత వేదికల ద్వారా పూల వర్షం కురిపించారు. కేరళ సింగాడి మేళం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయ చైర్మన్ చారి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల జూనియర్ లెక్చరర్ల దరఖాస్తు గడువు పెంచాలి

గౌలిపురా: తెలంగాణ రాష్ట్రంలోని గురుకుల జూనియర్ కాలేజీల్లో కొంత కాలంగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ కోసం రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేస్తూ చివరి తేదీ 17 మే 2023 విధించిన గడువును పెంచాలని సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.చంద్రమోహన్ గౌడ్ అన్నారు. సాంకేతిక కారణాలతో గత మూడు రోజుల నుంచి సర్వర్ పని చేయకపోవడంతో నిరుద్యోగ జూనియర్ లెక్చరర్స్ దరఖాస్తు చేసుకోలేకపోయారన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని మరో మూడు రోజుల పాటు దరఖాస్తుల గడువును పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

25 వేలమంది నిరుద్యోగులకు శిక్షణ

యాకుత్‌పురా: 2023–24వ విద్యా సంవత్సరంలో 25 వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నామని సెట్విన్ శిక్షణ సంస్థ ఎండీ వేణుగోపాల్ రావు తెలిపారు. పురానీహవేలీలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ... గత ఏడాది సంస్థ కేంద్రాలతో పాటు ఫ్రాంచైజీలలో మొత్తం 16,490 మంది విద్యార్థులు శిక్షణ పొందారన్నారు. నగరం, జిల్లాలోని 24 శిక్షణ కేంద్రాలతో పాటు ఆన్‌లైన్‌లో సైతం 57 వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న 45 కోర్సులతోపాటు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న నూతన కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు. నామమాత్రపు రుసుముతో సెట్విన్ అందిస్తున్న కోర్సుల్లో ఆసక్తి గల అభ్యర్థులు మోతీగల్లీ, ముషీరాబాద్, తార్నాక, యూసూఫ్‌గూడ, ఈస్ట్ మారేడ్‌పల్లి, ఏసీ గార్డ్స్, చైతన్యపురి, నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్, రియాసత్‌నగర్, మీరాలం ట్యాంక్, ఈదీబజార్, పురానీహవేలి, నెరేడ్‌మెట్, విద్యానగర్, మలక్‌పేట్, రసూల్‌పురా, ఎస్‌బీటీ నగర్, ఎర్రగడ్డ, అంబర్‌నగర్, సీతఫల్‌మండి శిక్షణ కేంద్రాలలో సంప్రదించాలన్నారు.



వేణుగోపాల్‌రావు, సెట్విన్ ఎండీ

ఉమ్రా యాత్రికులకు సన్మానం



ఉమ్రా వెళ్ళే వారిని సన్మానిస్తున్న అబ్బాస్ హుస్సేన్

గోల్కొండ: పవిత్ర ఉమ్రా యాత్ర చేయాలన్నది ప్రతి ముస్లిం జీవిత ఆశయమని ప్రముఖ ఫోటోగ్రాఫర్ అబ్బాస్ హుస్సేన్ అన్నారు. ఉమ్రా యాత్రకు వెళ్తున్న అఫ్సర్ మొహియుద్దీన్, మజర్ మొహియుద్దీన్‌లను బుధవారం ఆయన హకీంపేట్‌లో సన్మానించారు. కార్యక్రమంలో జుబేర్, హుసేన్ తదితరులున్నారు.



అవార్డు గ్రహీతలతో యాదగిరి తదితరులు

ఆర్టీసీ డ్రైవర్లకు సన్మానం

గన్‌ఫౌండ్రీ: రోడ్డు భద్రత వారోత్సవాలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడీ యాదగిరి అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో మహాకవి సినారె కళాపీఠం ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని ఆర్టీసీ ఉత్తమ డ్రైవర్లకు సేవా పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగుల సేవలను గుర్తించి పురస్కారాలు ఇవ్వడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో సినీ రచయిత సుద్దాల అశోక్‌తేజ, ఆర్టీసీ సికింద్రాబాద్ జోన్ రీజినల్ మేనేజర్ సీహెచ్ వెంకన్న పాల్గొన్నారు.

పేద ప్రజలకు ప్రయోజనంగా బస్తీ దవాఖానాలు



సుభాన్‌పురా బస్తీ దవాఖానాను సందర్శించిన బీఆర్ఎస్ నాయకులు ఆశీష్‌కుమార్ యాదవ్

అబిడ్స్: బస్తీ దవాఖానాలు పేద బడుగువర్గాల ప్రజలకు ప్రయోజనంగా మారాయని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆశిష్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. సుభాన్‌పురా బస్తీ దవాఖానాను ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ ప్రభుత్వం బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేయడంతో పేద ప్రజలకు వరాలుగా మారాయన్నారు. బస్తీలలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన

గన్‌ఫౌండ్రీ: 'మనిషిలో ఉన్న అహం ఎటువంటి పరిస్థితులకు దారితీస్తుంది?' అనే ఇతివృత్తంపై సాగిన నాటక ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. బుధవారం రవీంద్ర భారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో క్రియేటివ్ థియేటర్ ఆధ్వర్యంలో కో అహం నాటకాన్ని ప్రదర్శించారు. సినీ రచయిత గీతాభాస్కర్ మాట్లాడుతూ..ప్రస్తుత సమాజంలో ఉన్న మానవ సంబంధాల స్థితులను నాటకం రూపంలో చక్కగా ప్రదర్శించారని కొనియాడారు. కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత ఎస్వీ మార్గరేట్ రచించగా ఎం.అజయ్ దర్శకత్వం వహించారు.



పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటు చేయాలి

నాంపల్లి: హైదరాబాదు రైల్వేస్టేషన్ ఎదుట ఆధునీకరణ పేరుతో కూల్చివేసిన నాంపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను తిరిగి పునరుద్ధరించాలని, ఈ ప్రదేశంలో కొత్త భవనాన్ని నిర్మించి నాంపల్లి పోలీసు ఔట్ పోస్టును ఏర్పాటు చేయాలని స్థానికులు, రైల్వే ప్రయాణికులు కోరుతున్నారు. నాంపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను కూల్చివేసి తొమ్మిదేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు అక్కడ నిర్మించలేదని వాపోతున్నారు. నాంపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను హైదరాబాదు రైల్వేస్టేషన్ ఎదుట కాదని ఏసీగార్డ్స్‌లోని నిలోఫర్ ఆసుపత్రి సమీపంలోని పోలీస్ క్వార్టర్స్ ప్రాంతానికి తరలించడంలో శాస్త్రీయత లేదని పేర్కొంటున్నారు. ఇక్కడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లేకపోవడంతో హైదరాబాదు రైల్వే స్టేషన్ వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పూర్తి స్థాయి ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను ఏసీగార్డ్స్‌కు తరలించినా ఇక్కడ కనీసం ఔట్ పోస్టునైనా ఏర్పాటు చేయవచ్చు కదా అని పేర్కొంటున్నారు. ఫలితంగా ట్రాఫిక్ సమస్యను అధిగమించడం, రైల్వే ప్రయాణికుల సమస్యలను పరిష్కరించడం సులభతరం అవుతుందని అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఖాళీగా వదిలివేయడం మూలంగా ఇతరులు ఆక్రమించే అవకాశం కూడా లేకపోలేదని పేర్కొంటున్నారు.



నిర్మాణానికి నోచుకోని పోలీస్ స్టేషన్ ప్రదేశం ఇదే

ప్రభుత్వ ఆస్పత్రుల్లో విజయవంతంగా టెలీ మెడిసిన్



టెలీమెడిసిన్ కార్యక్రమంలో డాక్టర్ మజహార్ ఉల్లా

గోల్కొండ: ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరుగుతున్న టెలీ మెడిసిన్ కార్యక్రమం వల్ల రోగులకు మరింత మెరుగైన సలహాలు, సూచనలు అందుతున్నాయని గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహార్ ఉల్లా అన్నారు. బుధవారం గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో టెలీమెడిసిన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బస్తీ దవాఖానా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన ఆరోగ్యాధికారి, నర్సులు అక్కడికి వచ్చే వ్యాధులు, వారికి అందించాల్సిన మందులపై తమ అనుమానాలు నివృత్తిచేసుకుని సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ కూడా ఉంటారని, ఎప్పటికప్పుడు రోగులకు ఇవ్వాల్సిన మందులు ఆన్‌లైన్‌లో సూచిస్తారన్నారు.కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ సయ్యద్ హైదర్ తదితరులున్నారు.

బ్రాహ్మణ సంక్షేమానికి కేసీఆర్ పెద్ద పీట

సుల్తాన్‌బజార్: ముఖ్యమంత్రి కేసీఆర్ బ్రాహ్మణ సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. బుధవారం బొగ్గులకుంటలోని దేవాదాయ, ధర్మాదాయ ప్రధాన కార్యాలయంలోని బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి డాక్టర్ రమణాచారి అధ్యక్షత వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఈ నెల 31న గోపన్‌పల్లిలో రూ.12 కోట్లతో నిర్మించిన 6 ఎకరాల స్థలంలో బ్రాహ్మణ సదన్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ ప్రారంభోత్సవానికి 33 జిల్లాల నుంచి అన్ని బ్రాహ్మణ సంఘాల నాయకులు, ఉద్యోగులు అర్చకులు దాదాపు 5 వేల మంది పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గంగు ఉపేంద్ర శర్మ, అధ్యక్షులు పోచంపల్లి రమణారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమణాచారి, గంగు ఉపేంద్ర శర్మ తదితరులు

బీఆర్ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారు

గోల్కొండ: రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఎం.అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా బుధవారం షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు సత్యనారాయణ ఆయనను కలిశారు. కర్ణాటక ఎన్నికల ఫలితాలు తెలంగాణలో కూడా పునరావృతం కానున్నాయని అన్నారు. మతతత్వ పార్టీ అయిన బీజేపీకి కర్ణాటక ప్రజలు తగిన గుణంపాఠం నేర్పారని ఆయన అన్నారు. రానున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సైతం తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారన్నారు.



సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిని కలిసిన సత్యనారాయణ

కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం

జియాగూడ: కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ ఆధునిక భవన నిర్మాణానికి పోలీసులు విశేషంగా కృషి చేశారని శాంతి సంఘం, సంఘ సేవకుడు రాజేంద్ర పర్షాద్ జైస్వాల్ అన్నారు. బుధవారం నూతన పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్, ఎస్ఐలు శేఖర్, వేణుగోపాల్, మదన్‌మోహన్ తదితరులను సన్మానించారు. భవన నిర్మాణానికి ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ చేసిన సేవలు అభినందనీయమన్నారు.



ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పండుగలా సీఎం కప్ క్రీడా పోటీలు

గన్‌ఫౌండ్రీ: రాష్ట్రంలో క్రీడా నైపుణ్యాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రారంభించిన సీఎం కప్ పోటీలు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయని శాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్ అన్నారు. ఈ నెల 15న ప్రారంభమైన మండలస్థాయి పోటీలు విజయవంతంగా ముగిశాయని తెలిపారు. బుధవారం ఎల్బీస్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ నెల 21వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జిల్లాస్థాయి పోటీలు జరుగుతాయని తెలిపారు. మండల స్థాయిలో రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల మంది క్రీడాకారులు పాల్గొన్నారని వారిలో నుంచి 85 వేల మందిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు.



మాట్లాడుతున్న శాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్

క్రమబద్ధీకరణను సద్వినియోగం చేసుకోండి

దూద్‌బౌలి: ప్రభుత్వ భూముల్లో ఇళ్లు కట్టుకొని నివసిస్తున్న వారు జీవో 58,59 ద్వారా ఇళ్లను క్రమబద్ధీకరించుకోవాలని బహదూర్‌పురా మండల తహసీల్దార్ జుబేదా బేగం అన్నారు. బుధవారం గౌలిపురా వాల్మీకినగర్‌లో ఆమె సిబ్బందితో కలిసి పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. 2020 జూన్ 2లోగా ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు క్రమబద్ధీకరణకు అర్హులన్నారు. మే 31వ తేదీ వరకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని... దీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



అవగాహన కల్పిస్తున్న బహదూర్‌పురా మండల తహసీల్దార్ జుబేదా బేగం